క్లుప్తంగా

విజయమ్మను కలిసిన తాళ్లూరు జెడ్పీటీసీ



విజయమ్మతో జెడ్పీటీసీ వెంకటరెడ్డి

తాళ్లూరు (ముండ్లమూరు): దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మ శనివారం ఒంగోలు వచ్చిన సందర్భంగా తాళ్లూరు జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు బెల్లంకొండవారిపాలెం సర్పంచ్ పోశం సుమలత శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

చెంచులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లను పంపిణీ చేస్తున్న యల్లేష్

పెద్దదోర్నాల: దివంగతుడైన తన కుమారుడు గుమ్మా ధీరజ్ సాయికృష్ణ ఏడో జయంతిని పురస్కరించుకొని ఎంపీపీ గుమ్మా పద్మజ, వైఎస్సార్ సీపీ నాయకుడు గుమ్మా యల్లేష్‌లు చెంచు గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. శనివారం మండల పరిధిలోని చింతల, తుమ్మలబైలు గిరిజన గూడేల్లో జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో వారు పాల్గొని 100 మంది గిరిజనులకు దుప్పట్లతో పాటు, ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుమ్మా యల్లేష్ మాట్లాడుతూ చిన్న వయసులోనే తమను విడిచి వెళ్లిన ధీరజ్ శ్రీ కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మృతి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే అన్నా రాంబాబు



మల్లెల లక్ష్మమ్మ(ఫైల్)

బేస్తవారిపేట: మండలంలోని పిటికాయగుళ్ల మాజీ సర్పంచ్ మల్లెల వెంకటరెడ్డి సతీమణి ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మల్లెల లక్ష్మమ్మ శుక్రవారం రాత్రి మృతిచెందారు. లక్ష్మమ్మ కుమారుడు మల్లెల శేఖర్‌రెడ్డి ప్రస్తుతం ఎంపీటీసీ సభ్యుడిగా ఉన్నారు. ఆమె మృతదేహానికి ఎమ్మెల్యే అన్నా రాంబాబు శనివారం నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండా రఘునాథరెడ్డి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు ఉన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం



సెబ్ అధికారులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

కురిచేడు: మండలంలోని ఆవులమంద గ్రామానికి చెందిన గొట్టిపాటి రామకృష్ణ అనే వ్యక్తి వద్ద తెలంగాణకు చెందిన మద్యం బాటిళ్లను సెబ్ ఇన్‌స్పెక్టర్ సుందరరామయ్య తన సిబ్బందితో వెళ్లి శనివారం స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన రాయల్ స్టాగ్ విస్కీ 2 లీటర్ల బాటిళ్లు 5, మాన్‌సన్ హౌస్ 750 ఎంఎల్ ఒకటి, 375 యంఎల్ ఒకటి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఆశాజనకంగా దిగుబడి



సజ్జ రైతులకు సూచనలిస్తున్న ఏవో ప్రసాదరావు

తాళ్లూరు (ముండ్లమూరు): రైతులు ఈఏడాది ఖరీఫ్ లో సాగుచేసిన సజ్జపంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. దోసకాలయపాడులో సజ్జ కల్లాన్ని శనివారం పరిశీలించారు. సజ్జల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఏఏ భార్గవి రైతులున్నారు.

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మార్కాపురం: వై ఏపీ నీడ్స్ జగన్(రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగంగా జిల్లా అధ్యక్షుడు డి.గోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. మళ్లీ జగన్ సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలోని 20 లక్షల మంది దివ్యాంగులకు జనవరి నుంచి రూ.3 వేలు పింఛను ఇస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఆనందాల దసరా.. నవరాత్రి జాతర

- నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి



మార్కాపురం అమ్మవారిశాలలో వాసవీమాత

మార్కాపురం: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు పశ్చిమ ప్రకాశంలోని ప్రసిద్ధ ఆలయాల్లో దేవదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం నుంచి ప్రారంభమవుతున్న నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయాలకు పెద్ద సంఖ్యలో హాజరయ్యే భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

- మార్కాపురం పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గత 30 ఏళ్లుగా దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిశాల బజారు మొత్తం విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మిరుమిట్లుగొలిపే భారీ విద్యుత్ కటౌట్లు ఏర్పాటు చేశారు. రోజూ అమ్మవారికి పంచామృతాభిషేకం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఛండీ పారాయణం నిర్వహించనున్నారు. 16న బాలార్చన, 18న లక్ష్మీ గణపతి హోమం, 19న లక్ష బిల్వార్చన, 20న సరస్వతీ పూజ, 21న శ్రీ సుబ్రహ్మణ్య మూల మంత్ర సంపుటిత త్రిశతీ పూజ, 22న సుమంగళి పూజ, సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నారు. 15న అమ్మవారు వాసవీకన్యకాపరమేశ్వరిగా, 16న సావిత్రీదేవీ, 17న భవానీదేవీ, 18న అన్నపూర్ణాదేవీ, 19న శ్రీమహాలక్ష్మి, 20న సరస్వతీ దేవీ, 21న రాజరాజేశ్వరీదేవి, 22న మహిషాసురమర్ధిని, 23న గజలక్ష్మి, 24న కనకదుర్గ, విజయదుర్గ రూపంలో దర్శనమిస్తారని, 25న మహిషాసుర మర్ధినీగా వ్యాఘ్ర వాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బారావు, కోశాధికారి రామడుగు వెంకటరమేష్‌లు వివరించారు. ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో..

పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవస్థానంలోని జగదాంబదేవీ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ వాలిచర్ల కేశవరావు, ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి వివరించారు. 15న అమ్మవారిని శైలపుత్రిగా, 16న బ్రహ్మచారిణి, 17న చంద్రఘంట, 18న కూష్మాండ దుర్గ, 19న స్కంద మాత, 20న కాత్యాయని, 21న కాళరాత్రి, 22న మహిషాసురమర్ధిని, 23న సిద్ధిదాయిని, 24న పార్వతీదేవిగా అలంకరిస్తున్నట్లు తెలిపారు. 22న సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కొనకనమిట్ల మండలంలో..

కొనకనమిట్ల: మండలంలోని కొనకనమిట్ల, గొట్లగట్టు, పెదారికట్ల, రేగడపల్లి గ్రామాల్లో ఆదివారం నుంచి వాసవీ కన్యకాపరమేశ్వరి శరన్నవరాత్రులను వేడుకగా నిర్వహించనున్నారు. గొట్లగట్టు రాములవారి దేవస్థానం, కొనకనమిట్ల రామదూత క్షేత్రం, పోలేరమ్మ ఆలయం, పెదారికట్ల శివాలయం, మహాలక్షమ్మ ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాలల్లో అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు చేశారు.

గిద్దలూరులో..

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణంలోని నల్లబండ బజారులో దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, వీరన్నబావి సమీపంలోని కాళికాంబ ఆలంయ, పెద్ద బజారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, అంకాలమ్మ బజారులోని అంకాలమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. 9 రోజులపాటు అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిస్తారని నిర్వాహకులు తెలిపారు.

గొౖద్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో..

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల పంచాయతీ పరిధిలో రాజంపల్లి గ్రామంలో వెలసిన గొౖద్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో 15 నుంచి 24వ తేదీ వరకు రాజ్యలక్ష్మి అమ్మవారికి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక అలంకారాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు భవానీప్రసాద్ శనివారం తెలిపారు. 15న శుద్ధలక్ష్మి, 16న క్షీరసాగరకన్య, 17న గజలక్ష్మి (ఉదయం 10 గంటలకు పుష్పయాగం), 18న ధాన్యలక్ష్మి, 19న మహాలక్ష్మి, 20న విజయలక్ష్మి, 21న మహా సరస్వతి, 22న గాయత్రి (ఉదయం 9 గంటలకు చండీ హోమం), 23న వేదవతి, 24న రాజ్యలక్ష్మి సమేత గొౖద్రాలికొండ తిరుమలనాథస్వామి అలంకారం, 24న విజయదశమి (స్వామి వారు అశ్వ వాహనంపై గ్రామోత్సవం), 25న శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథస్వామి వారి తిరు కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతి రోజు అమ్మవారికి కుంకుమార్చనలు, అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రత్యేక పూజల్లో పాల్గొనే భక్తులు తమ పేర్లను ఆలయంలో తమ గోత్రనామాలతో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.



విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన అమ్మవారి కటౌట్



ప్రత్యేక అలంకారంలో రాజ్యలక్ష్మి అమ్మవారు

దసరా ఉత్సవాలకు ఆహ్వానం



ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి ఆహ్వానపత్రిక అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి(అమ్మవారిశాల) ఆలయంలో ఈనెల 15 నుంచి నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి, తర్లుపాడు జెడ్పీటీసీ వెన్నా ఇందిరకు పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కమిటీ ప్రతినిధులు శనివారం ఆహ్వాన పత్రాలు అందించారు. దసరా మహోత్సవాలను ఆలయంలో వైభవంగా నిర్వహిస్తున్నామని, ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శిసుబ్బారావు, కోశాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ జాతీయ అవార్డు గ్రహీతకు మంత్రి అభినందన



అవార్డు గ్రహీతకు నగదు బహుమతి అందజేస్తున్న మంత్రి సురేష్

పుల్లలచెరువు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.నిఖిల్, గైడ్‌టీచర్ ఎస్‌కే మస్తాన్ వలి జాతీయ స్థాయిలో ఇన్‌స్పైర్ అవార్డు పొందినందుకు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ విద్యార్థికి, గైడ్ టీచర్ లకు రూ.10 వేలు బహుమతిగా అందజేసి అభినందించారు. శనివారం మంత్రి కార్యాలయంలో అవార్డు గ్రహీతలను అభినందించి మాట్లాడుతూ మారుమూల ప్రాంతం నుంచి ఇటువంటి ప్రయోగాలు చేసి జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావడం ఎంతో సంతోషం అని, మంచి ఆలోచనలతో ముందుకు సాగి ప్రభుత్వానికి, జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని మంత్రి ఆకాంక్షించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు, నియోజకవర్గ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జానీబాష తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ సుబ్బయ్యకు మంత్రి సురేష్ నివాళి



సుబ్బయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

పుల్లలచెరువు: మండలంలోని మల్లాపాలెం సర్పంచ్ మంగినపల్లి సుబ్బయ్య శుక్రవారం మృతిచెందారు. శనివారం రాష్ట్ర పురపాలక శాఖమంత్రి ఆదిమూలపు సురేష్ మల్లాపాలెం వెళ్లి సుబ్బయ్య భౌతికకాయానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. మంత్రి వెంట నాయకులు రమణారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

విశ్వశాంతిని కాంక్షిస్తూ గాయత్రి యజ్ఞం



యజ్ఞం నిర్వహిస్తున్న గాయత్రి పరివార్ సభ్యులు

గిద్దలూరు రూరల్: విశ్వశాంతిని కాంక్షిస్తూ అమావాస్య సందర్భంగా పట్టణంలోని కాశినాయన నగర్‌లోని గాయత్రిమాత ఆలయంలో గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో శనివారం గాయత్రి యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ ధ్యాన మందిరం నిర్వాహకుడు పి.హనుమంతారెడ్డి మాట్లాడుతూ.. గాయత్రి యజ్ఞంతో సకల శుభాలు సంతరించుకుంటాయన్నారు. దేవీశరనవరాత్రుల సందర్భంగా 9 రోజులపాటు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిడతల సాయికల్పనారెడ్డి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి, గాయత్రి పరివార్ సభ్యులు పాల్గొన్నారు.

బీసీలకు చట్టసభల్లో సీట్లు కేటాయించాలి



అవగాహన సదస్సు నిర్వహిస్తున్న బీసీలు

గిద్దలూరు రూరల్: బీసీలకు చట్టసభల్లో సీట్లు కేటాయించాలని బీసీ నాయకులు కంచర్ల కోటయ్యగౌడ్ అన్నారు. పట్టణంలోని రాజు పారామెడికల్ శిక్షణ కాలేజీ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన బీసీ మహిళా రిజర్వేషన్‌పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 60 శాతం కంటే ఎక్కువగా ఉన్న బీసీ కులాల జన గణన చేపట్టాలన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు చట్టసభల్లో సీట్లు కల్పించాలని కోరారు. బీసీల ఆర్థిక పరిస్థితి మెరుగుపడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు డా.జేవీ నారాయణ, ఓ.వెంకటయ్య యాదవ్, గురుప్రసాద్, పాశం వెంకటేశ్వర్లు, మొర్రి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు

కొనకనమిట్ల: మహాలయ పక్షం చివరి శనివారం సందర్భంగా కొనకనమిట్ల మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు. ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండలో శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకలు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్లలోని రామదూత క్షేత్రంలో నందీశ్వరునికి తైలాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయ వేదపండితులు అకలంకం వెంకటకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఉభయదాతలు నిర్వహించారు.



కొనకనమిట్ల రామదూతక్షేత్రంలో నందీశ్వరుడికి తైలాభిషేకం

మినుము విత్తనాలు పంపిణీ



రైతులకు మినుములు అందజేస్తున్న ఏఓ

కొనకనమిట్ల: రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన పలు రకాల మినుము విత్తనాలను ఎన్ఎఫ్ఎస్ఎం పథకం ద్వారా ఉచితంగా అందజేస్తున్నట్లు ఏఓ ప్రసన్న రంగలక్ష్మి తెలిపారు. మండలంలోని ఇరసలగుండం గ్రామంలో సర్పంచ్ గోపిరెడ్డి ఓబులరెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతులకు విత్తనాలు అందజేశారు. ఏఓ మాట్లాడుతూ.. ఇరసలగుండంతోపాటు గొట్లగట్టు, గరిమినపెంట, చినమనగుండం, కాట్రగుంట, గార్లదిన్నె, నాగంపల్లి గ్రామాలకు ఎల్‌బీజీ 787 రకం, టీబీజీ 104 రకాలకు సంబంధించి 50 క్వింటాళ్ల మినుములను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. రైతు క్షేత్రంలో పరీక్ష నిర్వహించేందుకు ఉచితంగా మినములు అందజేసినట్లు చెప్పారు.

ఉపాధ్యాయులే భావిభారత నిర్మాతలు



ప్రసాద్‌ను సన్మానిస్తున్న పీఎల్పీ యాదవ్ తదితరులు

మార్కాపురం: ఉపాధ్యాయులే భావిభారత నిర్మాతలని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పిన్నిక లక్ష్మీప్రసాద్‌యాదవ్ పేర్కొన్నారు. మార్కాపురం మండలంలోని రాయవరం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు పిన్నిక ప్రసాద్ స్పందన ఫౌండేషన్ ద్వారా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన సందర్భంగా శనివారం పట్టణంలోని బీసీ భవన్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీఎల్పీ యాదవ్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ప్రసాద్ మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యనందించి ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు అచ్చయ్య, రంగస్వామి గౌడ్, శ్రీనివాసులు, సీతారామయ్య, టిపి వెంకటేశ్వర్లు, వి.శ్రీనివాస్, ఆదామ్ సాహేబ్, మస్తాన్, చిన్నయ్య యాదవ్, కౌన్సిలర్ నాలి కొండయ్య యాదవ్, రాజ్‌కుమార్, న్యాయవాదులు విజయవర్ధన్, నాగార్జున యాదవ్, బుర్రి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పొదిలి విద్యార్థి

పొదిలి: రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు స్థానిక గీతాంజలి విద్యార్థి బి.జోషి మేచెల్ ఎంపికయ్యాడని డైరెక్టర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ ప్రశాంతి తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో మేచెల్ సత్తా చాటిందని చెప్పారు. పాఠశాల యాజమాన్యంతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు.

ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై కోటేశ్వరరావు

మార్కాపురం టౌన్: ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పట్టణ ఎస్సై కోటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఆయన జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించని, లైసెన్స్ లేని పలువురు వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని హెచ్చరించారు. లైసెన్సు లేకుండా వాహనంతో రోడ్డెక్కితే సీజ్ చేస్తామని చెప్పారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే వారిపై కేసులు నమోదు చేసి, జరిమానా విధిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాలకు జరిమానా విధించారు.

డ్వాక్రా మహిళలకు పెరటి కోళ్ల పంపిణీ



మహిళలకు పెరటికోళ్లు అందిస్తున్న ఏపీఎం

తర్లుపాడు: డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో మండలంలోని డ్వాక్రా గ్రూపుల మహిళలకు ఏపీఎం పిచ్చయ్య 100 యూనిట్ల పెరటికోళ్లను శనివారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో పంపిణీ చేశారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం పెరటికోళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. స్వయం సహాయక గ్రూపుల్లోని మహిళల జీవనోపాధి కోసం వడ్డీలేని రుణాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాడు అందిస్తున్నట్లు చెప్పారు. పెరటికోళ్ల పెంపకం ద్వారా వచ్చే గుడ్లను గర్భిణులు, బాలింతలు ఉపయోగించుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. పెరటికోళ్ల పెంపకానికి అవసరమైన దాణా అందించారు. కార్యక్రమంలో వెలుగు సీసీ సాయిలు, వీఓఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో నేటి నుంచి 'చదవడం మాకిష్టం'

మార్కాపురం టౌన్/తర్లుపాడు/గిద్దలూరు రూరల్/పెద్దారవీడు: దసరా సెలవుల సందర్భంగా ఈనెల 15వ తేదీ ఆదివారం నుంచి 24వ తేదీ వరకు ×చదవడం మాకిష్టం₹ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మార్కాపురం, తర్లుపాడు, గిద్దలూరు, పెద్దారవీడు గ్రంథాలయాల లైబ్రేరియన్లు జీవీ శివారెడ్డి, పీవీ సుబ్బారెడ్డి, నల్లబోతుల ప్రసన్నకుమారి, ఏర్వ వెంకటేశ్వరరెడ్డి శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ కార్యక్రమం రోజూ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తామని, విద్యార్థులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా నీతి కథలు చెప్పించడం, కథలు చదవించడం, చిన్నారులకు పుస్తకపఠనాన్ని అలవాటుచేయడంతోపాటు శారీరక, మానసిక ఆనందం కోసం వివిధ రకాల ఆటపాటలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా గ్రంథాలయాలకు రావాలని లైబ్రేరియన్లు కోరారు.

20, 21 తేదీల్లో క్విజ్, పాటల పోటీలు

ఒంగోలు మెట్రో: ప్రజానాట్యమండలి కళాకారుడు, సంచలన సినీ దర్శకుడు టి.కృష్ణ 37వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 20, 21 తేదీల్లో ఒంగోలు సీవీఎన్ రీడింగ్ రూమ్‌లో క్విజ్, పాటల పోటీలు నిర్వహించనున్నట్లు టీ కృష్ణ మెమోరియల్ కల్చరల్ సొసైటీ కమిటీ సభ్యుడు పీవీఆర్ చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 20వ తేదీ ఉదయం 9 గంటలకు జూనియర్స్ (హైస్కూల్ విద్యార్థులు)కు, అనంతరం సీనియర్స్ (కాలేజీ విద్యార్థులకు)కు క్విజ్ పోటీలు జరుగుతాయన్నారు. 21వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు పాటల పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఈ పోటీల్లో హైస్కూల్, కాలేజీ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు సినీ హీరో గోపీచంద్ ఆర్థికసాయం కూడా అందజేస్తారన్నారు. విజేతలకు 21వ తేదీ సాయంత్రం నిర్వహించే బహిరంగ సభలో టి.కృష్ణ తనయుడు, సినీ హీరో గోపీచంద్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.